క్లుప్తంగా

సీతకు సేవా రత్న అవార్డు


యెండూరి సీతామహాలక్ష్మి

అమలాపురం టౌన్: కరోనా సమయంలో రోగులకు ఉచితంగా ఆక్సిజన్ సిలండర్లు ఇవ్వడమే కాకుండా ఆక్సిజన్ కాన్సంటేటరును అందించిన జిల్లా ఆర్య వైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మికి దాసరి సేవా రత్న అవార్డు లభించింది. 'మా' అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇస్తున్న ఈ అవార్డును వచ్చే నెల ఒకటో తేదీన హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా ఆర్యవైశ్య మహా సభ, అమలాపురం పట్టణ వైశ్య సంఘం, వాసవీ క్లబ్ సభ్యులు అభినందించారు.

మండల టాపర్‌కు బహుమతి


విద్యార్థికి అంబేడ్కర్ చిత్రపటం అందిస్తున్న సంఘ సభ్యులు

ముమ్మిడివరం: పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులతో మండల టాపర్‌గా నిలిచిన ఠానేల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కాగిత భానుప్రకాష్‌కు ఏపీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు రూ.5 వేల నగదు బహుమతి అందజేశారు. ఆదివారం ఠానేల్లంక చినపేటలో విద్యార్థి భానుప్రకాష్ స్వగృహానికి వెళ్లిన సంఘ సభ్యులు నగదు బహుమతితో పాటు అంబేడ్కర్ చిత్రపటం, జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మట్టా శ్రీనివాసరావు, ఎంఈఓ బొజ్జా రమణశ్రీ, కాశి వెంకటాచార్య, జనిపెల్ల బాలకృష్ణ, ఎం.ఆశీర్వాదం, జె.సత్యనారాయణ, పి.డానియేలు, ఎస్.అబ్బులు, నక్కా శ్రీనివాస్, కటికదల రాము తదితరులు పాల్గొన్నారు.

1న ఇంటి వద్దకే పింఛన్

అల్లవరం: మే 1న దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యం పాలైన పింఛన్‌దారులకు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. ఆధార్‌తో అనుసంధానమైన లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకే డీబీటీ విధానం ద్వారా పింఛన్ డబ్బులు జమ చేస్తామన్నారు. లబ్ధిదారులెవరూ సచివాలయానికి రావాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాని లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్ అందిస్తారన్నారు. మండలంలో 9,583 పింఛన్లను మే 1 నుంచి 5వ తేదీలోపు పంపిణీ చేస్తామన్నారు.

పది నాణేన్ని తిరస్కరించడం చట్ట విరుద్ధం

యానాం: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా విడుదలైన పది రూపాయల నాణేన్ని తిరస్కరించడం చట్ట విరుద్ధమని పుదుచ్చేరి వెట్టక సభ పార్టీ నేత గుణశేఖరన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పది నాణెం చెల్లుబాటుపై అనేక వదంతులు రావడంతో వ్యాపారులు తీసుకోవడం మానేశారన్నారు. దీంతో ఇటీవల రిజర్వు బ్యాంకు సైతం పది నాణేలు చెల్లుబాటవుతాయంటూ ప్రకటన జారీ చేసిందన్నారు. పుదుచ్చేరి, కారైకల్, యానాం అధికార యంత్రాంగాలు సైతం ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాలని కోరారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో క్రీడాకారుల ప్రతిభ


వెయిట్ లిఫ్టింగ్‌లో తృతీయ స్థానం సాధించిన యానాం క్రీడాకారులు

యానాం: పుదుచ్చేరి స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆదివారం జరిగిన పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో యానాం క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచారని జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీఈటీ పాము సత్యనారాయణ తెలిపారు. అండర్–17 విభాగంలో ఎస్.లావణ్య, పి.లక్ష్మి, ధనకుమారిలు 40, 45, 55 కేజీల బరువులను ఎత్తి తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. అండర్–17 బాలుర విభాగంలో ఎస్.భైరవమూర్తి, కె.యశ్వంత్‌లు 49, 61 కేజీలను ఎత్తి తృతీయ స్థానాన్ని సాధించారన్నారు.

డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలి

అమలాపురం రూరల్: ఆంధ్రుల అన్నపూర్ణగా పిలుచుకునే డొక్కా సీతమ్మ జీవిత చరిత్రను భావి తరాలకు తెలియజేసేందుకు పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని బాల భక్త గణపతి సేవా సంఘం సభ్యులన్నారు. మండలంలోని ఇందుపల్లిలోని బాల భక్త గణపతి మందిరంలో ఆదివారం డొక్కా సీతమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈదరపల్లిలోని హరి మనోవికాస కేంద్రం మానసిక పాఠశాలలో విద్యార్థుల కోసం పండ్లు, స్వీట్లు, బిస్కెట్లు, నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శిష్ట భవానీ శంకరం, టీఎస్ఎస్ శర్మ, శిష్ట సుధా, తాత రజనీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనే రావాలి

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- వానపల్లిపాలెం, గొల్లవిల్లిలో ఎన్నికల ప్రచారం


వానపల్లిపాలెంలో టీడీపీ, జనసేన కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్


వానపల్లిపాలెంలో ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు అభివాదం చేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని వానపల్లిపాలెం, గొల్లవిల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన తన తనయుడు కృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత వానపల్లిపాలెం గ్రామంలో ఆదిగణపతి ఆలయం వద్ద కొబ్బరికాయ కొట్టి ఎన్నికల ప్రచారం కొనసాగించారు. మధ్యాహ్నం నుంచి గొల్లవిల్లి గ్రామంలో ప్రచారం జరిపారు. గ్రామాల్లో పర్యటిస్తున్న ఆయనకు అభిమానులు పూల వర్షం కురిపించారు. మహిళలు అడుగడుగునా నీరాజనాలు అందిస్తూ మళ్లీ మీరే మాకు ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. వానపల్లిపాలెం గ్రామంలో టీడీపీ మద్దతుదారులైన మాజీ సర్పంచ్‌లు దోనిపాటి ఈశ్వరరావు, నక్కా నాగేంద్రుడి కుటుంబసభ్యులు, మరో 40 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు మంత్రి విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాటకు కట్టుబడి 99 శాతం అమలు పరిచారన్నారు. 2024 మేనిఫెస్టో గతం కంటే మెరుగ్గా ఉందన్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి అందరూ అండగా ఉండాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీకి ఘన విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు బడుగు గణేష్, నల్లా నాయుడు, ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, కార్మిక విభాగం మండల అధ్యక్షుడు వీరవెల్లి చినబాబు, వల్లభరెడ్డి రాంబాబు, మండల లీగల్ సెల్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, కుంచే రమణారావు, నల్లా సూర్యప్రకాష్, నల్లా శ్రీనివాసరావు, దోనిపాటి వెంకటేశ్వరరావు, మెట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మంత్రి విశ్వరూప్‌కు సత్కారం


మంత్రి విశ్వరూప్‌ను సత్కరిస్తున్న ఆటోవాలా వర్కర్స్ యూనియన్ నాయకులు

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు వాహన మిత్ర పథకం ద్వారా అందించే సాయాన్ని రూ.10 వేల నుంచి 20 వేలకు పెంచడంపై ఆంధ్ర ఆటోవాలా వర్కర్స్ యూనియన్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం భట్లపల్లిలోని మంత్రి స్వగృహంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆటో కార్మికులకు మేలు చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ మంత్రి విశ్వరూప్‌ను సత్కరించారు. మంత్రిని కలిసినవారిలో మాజీ కౌన్సిలర్ వంటెద్దు వెంకన్నాయుడు, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, జనరల్ సెక్రటరీ, ఊటాల వెంకటేష్, కమిటీ సభ్యులు రావూరి రాంబాబు, గొల్లపల్లి ప్రసాద్, బొక్క మంగరాజు, నాని తదితరులున్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు


కేశనకుర్రులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్


ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణలకు ఘన స్వాగతం పలుకుతున్న అభిమానులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- కేశనకుర్రులో జోరుగా ఎన్నికల ప్రచారం

ఐ.పోలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామంలోని అరుంధతీనగర్, జాంబవానిపేట, పేర్రాజు చెరువు, పెద్ద చెరువు, పెదపేట, చిన్న చెరువు, చాకివాని చెరువు, అక్కపువాని చెరువు, చింతలమెరక, పెదలంక, అల్లూరివారి చెరువు, పొగాకులంక, కన్నపులంక ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే పొన్నాడకు మహిళలు గడప గడపలో హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు మేలు చేసిన జగనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమన్నారు. ప్రతిపక్ష కూటమికి డిపాజిట్లు కూడా దక్కవన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, కాశి బాలమునికుమారి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, ఢిల్లీ నారాయణ, పిన్నంరాజు బాబ్జిరాజు, ఇందుకూరి రంగరాజు, కాశి పరివాజ్ కుమార్, కాశే రాజుబాబు, పెన్మత్స వాసురాజు, పెమ్మాడి బాబూరావు, చింతా రాంబాబు, వనచర్ల దత్తుడు, షేక్ సుభాన్ డాక్టర్, పెద్దిరెడ్డి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అల్లదిగో ఆశా ద్వీపం.. అక్కడ సైతం పోలింగ్

- హోప్ ఐలాండ్ పోలింగ్ కేంద్రం సందర్శన
- ఏర్పాట్లను పరిశీలించిన అధికారుల బృందం


హోప్ ఐలాండ్ ద్వీప ప్రజలతో కేంద్ర ఎన్నికల శాఖ అధికారులు

తాళ్లరేవు: ప్రజాస్వామ్యంలో ఎన్నికల పండగ కేవలం మైదాన ప్రాంతాలు, పర్వత ప్రాంతాలకే పరిమితం కాలేదు. సముద్రం మధ్యలో ఉన్న ద్వీపాల్లో సైతం జరుగుతుంది. ఇదే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ గొప్పతనంగా ప్రపంచ దేశాలన్నీ కీర్తిస్తుంటాయి. ఇటీవల సిక్కింలో పర్వత ప్రాంతంలో ఉన్న ఒక్క ఓటరు కోసం సుమారు 30 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లి ఎన్నికల సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేలా చేసిన ఘనత మన ఎన్నికల సంఘానిది. బంగాళాఖాతం మధ్యలో చుట్టూ సముద్రపు గాలులు తప్ప ఏ విధమైన రణగణ ధ్వనులు వినిపించని ప్రాంతం హోప్ ఐలాండ్. కాకినాడ నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలో సహజ సిద్ధంగా ఏర్పడిన కోరంగి పంచాయతీ పరిధిలోని హోప్ ఐలాండ్ సుమారు 8.04 కిలోమీటర్ల విస్తీర్ణం, 16.2 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ ప్రాంతానికి కేవలం చేపలవేట కోసం వచ్చిన మత్స్యకారులు ఇక్కడే స్థిర నివాసం ఉంటూ గతంలో పుత్రయ్యపాకలు, సొర్లగొండు పాకలుగా పిలిచేవారు. ప్రస్తుతం ఇక్కడ సుమారు 200 వరకూ కుటుంబాలు నివసిస్తున్నాయి. అక్కడ ఏర్పాటుచేసిన 218 నెంబరు పోలింగ్ కేంద్రాన్ని ఐఏఎస్ అధికారుల బృందం అడుగుపెట్టింది. ఆదివారం కాకినాడలోని జవహర్ జెట్టీ నుంచి వారు ప్రత్యేక లాంచీపై రెండు గంటల పాటు ప్రయాణించి హోప్ ఐలాండ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారులు రాజేశ్వర్ గోయల్, ప్రదీప్‌కుమార్, వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి రాహుల్ దింగ్రా పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి స్థానిక మండల రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రంలో ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనేలా ఏర్పాటుచేసిన మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా హోప్ ఐలాండ్‌లో నివసిస్తున్న 315 మంది ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో చైతన్యం కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. నిష్పక్షపాతంగా, ధైర్యంగా ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్థానికులను కోరారు. అధికారుల బృందం వెంట తాళ్లరేవు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, పి.సాయి, తేజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయి


అమలాపురంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి


అమలాపురంలో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి అందిన సంక్షేమ ఫలాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపిస్తాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. పట్టణంలోని 5, 6 వార్డుల్లో బేబీ మీనాక్షి, 16వ వార్డులో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో కలిసి డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, మండల పరిషత్ అధ్యక్షురాలు కుడుపూడి భాగ్యలక్ష్మి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, రాష్ట్ర హాండీక్రాఫ్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉండ్రు బేబీ ధనలక్ష్మి, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి దేవరపల్లి గీత, ఉండ్రు వెంకటేష్, కుడుపూడి భరత్ భూషణ్, వంటెద్దు వెంకన్నాయుడు, మెండు రమేష్‌బాబు, గోపి రాజీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

1వ తేదీ నుంచి భీమ్ విజ్ఞాన కేంద్రాలు


భీమ్ విజ్ఞాన కేంద్రాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం సభ్యులు

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వచ్చే నెల 1వ తేదీ నుంచి భీమ్ విజ్ఞాన కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఏపీఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు తెలిపారు. అమలాపురం బుద్ధ విహార్‌లో ఆదివారం డీబీ లోక్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నకుల రాజు మాట్లాడుతూ ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసే భీమ్ విజ్ఞాన కేంద్రాలు విద్యార్థులను సర్వతో ముఖాభివృద్ధి చేసేలా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, వడ్డి శ్రీనివాసరావు, నేరేడుమిల్లి సత్యనారాయణ, సీహెచ్ రాంబాబు, గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్, కుంచె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం


ప్రసంగిస్తున్న సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ ప్రభాకర్

అమలాపురం టౌన్: బాల బాలికల్లో నాటుకునే నైతిక విలువలతోనే సంస్కారవంతమైన సమాజం సాకారమవుతుందని అమలాపురం డివిజన్ శ్రీసత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్ అన్నారు. స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో బాల బాలికలకు ఏర్పాటైన శ్రీసత్యసాయి బాల వికాస్ ఉచిత వేసవి శిక్షణా తరగతులను డాక్టర్ ప్రభాకర్ ఆదివారం ఉదయం ప్రారంభించి ప్రసంగించారు. డాక్టర్ ప్రభాకర్‌తో పాటు స్థానిక ఆంధ్రా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వినోద్ జ్యోతి ప్రజ్వలన చేసి సత్యసాయి చిత్రపటానికి పూజలు చేశారు. జిల్లా సత్యసాయి బాల వికాస్ కేంద్రాల సమన్వయకర్త శిష్టా గుణరంజన్ శిక్షణా తరగతులకు హాజరైన బాలబాలికలకు కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల వికాస్ జిల్లా మహిళా సమన్వయకర్త భవాని, బాల వికాస్ ప్రతినిధి విజయబాల తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ బీచ్‌లో అంధకారం

యానాం: పట్టణ పరిధిలోని రాజీవ్ రివర్ బీచ్‌లో గత కొద్దిరోజులుగా విద్యుత్ లైట్లు వెలగక రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటుంది. వేసవి సెలవుల నేపథ్యంలో సాయంత్రం సమయంలో కాసేపు సరదాగా గడుపుదామని వస్తున్న వందలాది మంది సందర్శకులు సూరీడు అస్తమించడంతోనే భయంతో వెనుదిరుగుతున్నారు. ఆదివారం సెలవురోజు కావడంతో రాజీవ్ బీచ్‌లో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంది. అయితే విద్యుత్ లైట్లు వెలగక అంధకారంగా ఉండటంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాజేష్(ఫైల్)

తాళ్లరేవు: మండల పరిధిలోని జి.వేమవరం పంచాయతీకి చెందిన శ్రీపాదం రాజేష్(19) అనే యువకుడు పురుగుల మందు తాగి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న రాజేష్ పలుమార్లు ఇంటికి ఆలస్యంగా వస్తుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో ఈ నెల 19వ తేదీన రాజేష్ పురుగుల మందు తాగడంతో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కోరంగి ఎస్ఐ ఎస్.రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భగ్గుమంటున్న భానుడు


గొల్లవిల్లిలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి


ఉప్పలగుప్తంలో ఎండ తాకిడికి చీర చెంగు అడ్డుపెట్టుకుని వెళ్తున్న మహిళలు

ఉప్పలగుప్తం: మే నెల రాకుండానే భానుడు భగ్గుమంటున్నాడు.. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే చాలు ఉక్కబోతకు తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. గత వేసవిలో ఉష్ణోగ్రత 43 డిగ్రీలు దాటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ ఏడాది సైతం అదే రీతిలో ఉష్ణోగ్రతలు ఉండడంతో పాటు తీవ్ర వడగాల్పులు ఉంటాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఎండల తీవ్రతకు తట్టుకోలేక మధ్యాహ్న సమయంలో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వ్యాపారులు సైతం మధ్యాహ్నం సమయంలో దుకాణాలు మూసేసి సాయంత్రం 5 గంటలు దాటాకే తెరుస్తున్నారు. తప్పనిసరై రోడ్డుపై ప్రయాణించే వారు సైతం ఎండ తాకిడికి తట్టుకోలేక నీడ కోసం అల్లాడుతున్నారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి గ్రామాల్లో కనిపించిన ఈ చిత్రాలు ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

డొక్కా సీతమ్మ వచన కావ్యం ఆవిష్కరణ


డొక్కా సీతమ్మ వచన కావ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నానిరాజు

అమలాపురం టౌన్: స్థానిక భూపయ్య అగ్రహారంలో సాయి సంజీవిని వాకర్స్ యోగా ఆరోగ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవి నల్లా నరసింహమూర్తి రచించిన డొక్కా సీతమ్మ వచన కావ్యం ద్వితీయ ముద్రణను మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఆవిష్కరించారు. తొలుత డొక్కా సీతమ్మ చిత్రపటానికి నానిరాజు, ఉషాకుమారి దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోనసీమలో డొక్కా సీతమ్మ పేరు తలవగానే ఆంధ్రుల సేవా గుణం గుర్తుకొస్తుందని నానిరాజు అన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరిపారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కడలి సత్యనారయణ, అప్పారి వెంకటేశ్వరరావు, చాట్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార తాపం.. పుచ్చకాయతో మాయం


కోరంగిలో ప్రచారం ముగిశాక పుచ్చకాయ ముక్కలను తింటున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

తాళ్లరేవు: ఎన్నికలకు మరో రెండు వారాలే గడువున్న నేపథ్యంలో ప్రచారాలు ఊపందుకున్నాయి. మండుటెండలను సైతం లెక్కచేయకుండా రాజకీయ పార్టీల అభ్యర్థులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. అయితే ప్రచారంలో పాల్గొంటున్న కార్యకర్తలకు పలువురు నాయకులు తాగునీరు, మజ్జిగ సరఫరా చేస్తుండగా, కొందరైతే వేసవి తాపాన్ని తగ్గించే పుచ్చకాయ ముక్కలను పెడుతున్నారు. మండుటెండలో ప్రచారం చేసిన కార్యకర్తలు పుచ్చకాయ ముక్కలను తిని సేద తీరుతున్నారు. ముమ్మిడివరం నియోజవకర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ కోరంగి పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న సందర్భంగా పాతకోరంగి గ్రామానికి చెందిన పార్టీ నేత వేగేశ్న రమేష్‌రాజు పుచ్చకాయలను తెప్పించి ముక్కలుగా కోసి పంపిణీ చేశారు. వీటిని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇష్టంగా ఆరగించారు. ఆ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

తాగునీటి చెరువుల పరిశీలన

యానాం: వేసవి నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని చెరువుల్లో నీటి నిల్వలను అంచనా వేయడానికి రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి ఆదివారం పలు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని నల్లచెరువును, రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన స్వయంగా చూసి నీటి నిల్వలపై సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహం ఎదురుగా ఉన్న 55 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రెండు తాగునీటి చెరువులను పరిశీలించారు. నీటి నిల్వలు అడుగంటుతున్న నేపథ్యంలో నీటి నిల్వలను పెంచుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు.